## క్లుప్తంగా

### సోమవారం 'స్పందన' రద్దు

**రేపల్లె:** ఈ నెల 15న సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపట్నంకు 16న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. మరుసటి సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

### మహిళా ప్రొఫెసర్‌కు డాక్టరేట్



**అమృతలూరు(భట్టిప్రోలు):** అమృతలూరు మండలం తురిమెళ్లకు చెందిన, ప్రొఫెసర్ మార్పు లక్ష్మీమాధురికి డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తాడేపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, వర్శిటీ వైస్ చాన్సలర్ తోలేటి జానకిరామ్ చేతుల మీదగా శుక్రవారం డాక్టరేట్‌ను ఆమె అందుకున్నారు. ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్ అండ్ యారోమాటిక్ క్రాప్స్ అనే అంశంపై మాధురి పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు.

### అర్ధరాత్రి దొంగతన యత్నం

**కొల్లూరు:** అర్ధరాత్రి పలు గృహాల్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికు యత్నించిన ఘటన దోనేపూడి శివారు ఆలపాటి నగరంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు ఆలపాటినగరంలోకి ప్రవేశించి, మూడు గృహాల్లో దొంగతనాలకు పాల్పడేందుకు తలుపులు తెరిచారు. గుర్తుతెలియని వ్యక్తుల రాకతో కుక్కలు అరుస్తుండటంతో నిద్ర నుంచి మేల్కొన్న ఓ వ్యక్తి పరిసరాలను పరిశీలించగా వీరు తారసపడ్డారు. వెంటనే స్థానికులను అప్రమత్తం చేసేందుకు, కేకలు వేస్తూ వారిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. దీంతో అక్కడి నుంచి ఆ ముగ్గురూ గ్రామానికి సమీపంలో రేపల్లె–తెనాలి ప్రధాన రహదారిలో సిద్ధంగా నిలిపి ఉంచిన వాహనంలో పరారయ్యారు. ఈ ఘటనపై వేమూరు సీఐ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా.. దొంగతనాల యత్నంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, గ్రామాలలో చోరీలు జరగకుండా రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పటిష్టం చేస్తామన్నారు. గ్రామాలలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తుల ఉనికిని గుర్తించిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### 'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

**తెనాలిరూరల్:** మోరిస్ పేట ఆర్ఆర్‌నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో 3 నుంచి 9వ తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపల్ కె.శిరోమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 63048 03991, 94910 61138 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

### మృదంగ విద్వాంసుడు రామకృష్ణకు సత్కారం



**తెనాలి:** పట్టణంలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, నటించిన సినిమాలపై చర్చా వేదిక నిర్వహించారు. పొన్నూరు వెంకట శ్రీనివాసులు, షేక్ అస్మతున్నీసా సినిమాల్లో అన్నగా ఎన్టీఆర్ అనే అంశంపై మాట్లాడారు. వక్తలతో పాటు ప్రముఖ ఏ–గ్రేడ్ మృదంగ విద్వాంసుడు, కంచి కామకోటి ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకట రామకృష్ణను సత్కరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, బెల్లంకొండ వెంకట్, ఆళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు కృషి

**తాడేపల్లిరూరల్:** దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ, రూరల్ కమిటీ విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రతి చిన్న విషయాన్ని అడ్డుపెట్టుకుని మతత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. నీటి కుళాయిలకు మీటర్లు పెట్టడం, వ్యవసాయ బోరులకు మీటర్లు పెట్టడం, విద్యుత్ ఛార్జీలు పెంచడం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం విధానాలుగా పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈనెల 19న అమరజీవి పుచ్చలపల్లి సుందయ్య వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# 15లోపు పంట నష్టం నమోదు పూర్తికావాలి

**మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏడీఏ అక్తర్**



రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ

**కొల్లూరు:** అకాల వర్షాలకు ఏర్పడిన పంట నష్ట నమోదు ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని, అవకతవకలు, అలసత్వానికి తావుండకూడదని రేపల్లె ఏడీఏ అక్తర్ హుస్సేన్ స్పష్టం చేశారు. శనివారం ఏఓ ఆర్.వెంకటేశ్వరరావుతో కలసి ఆయన రావికంపాడు, చినపులివర్రు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. తమ పరిశీలనలో టార్పాలిన్ పట్టలు కప్పిన, కల్లాల్లోని ఓదెల మీదున్న మొక్కజొన్న కండెలు కొంతమేర మొలకుల రావడం, ఫంగస్ ఏర్పడటం, రంగు మారడం వంటి నష్టాన్ని గమనించామన్నారు. వీఏఏ, వీహెచ్‌ఏలు పంట నష్టపోయిన ప్రతి పొలం వద్ద వీఆర్‌ఓలు, రైతులతో ఫోటోలు దిగి, ఎంత శాతం పంట నష్టం ఏర్పడిందో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ నెల 15లోపు నష్ట నమోదు ప్రక్రియను పూర్తి చేసి, జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచాలని చెప్పారు. పంట నష్టం నమోదు విషయంలో వీఏఏ, వీహెచ్‌ఏలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే.. తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు..**

**వేమూరు:** అకాల వర్షాలకు దెబ్బతిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రేపల్లె ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. వేమూరు గ్రామంలో జొన్న, మొక్కజొన్న పంట దిగుబడిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం మొక్కజొన్న పంట క్వింటా రూ.1,962ల మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులందరూ తప్పని సరిగా రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ చేయించుకొని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మొలకెత్తిన గింజలు, 30 శాతానికి పైగా బూజు పట్టిన గింజలు ఉంటే.. సంబంధిత ఆర్బీకేలో వ్యవసాయ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులందరూ తమ పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. ప్రభుత్వం డబ్బులు వెంటనే చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం జగన్ రైతు పక్షపాతి

**– మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారామిరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సీతారామిరెడ్డి

**కర్లపాలెం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు, బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి పేర్కొన్నారు. కర్లపాలెం పెద్దింటమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ధాన్యానికి సీఎం వైఎస్ జగన్ గిట్టుబాటు ధర కల్పించటంతో పాటు 90 శాతం మేర ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినందుకు రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. బాపట్లలో ఎమ్మెల్యే కోన రఘుపతి చొరవతో అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టి 95 శాతం మేరకు ధాన్యం కొనుగోలు చేసి, నగదు చెల్లించారని సీతారామిరెడ్డి చెప్పారు. ఇంకా రైతుల వద్ద ఉన్న రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. బ్రిటీష్ కాలం నుంచి సమస్యగా ఉన్న చుక్కల భూములపై రైతులకు పూర్తి అధికారాలు కల్పించేందుకు సీఎం చర్యలు చేపట్టటం అభినందనీయమన్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు కావలసిన సహాయం అందించేందుకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రైతులకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ పందరబోయిన సుబ్బారావు, చింతాయపాలెం సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు ఆట్ల నాగేశ్వరరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, నాయకులు ఆట్ల పెద శ్రీనివాసరెడ్డి, మార్పు బెనర్జి, ఏత్ర ప్రసాద్‌రెడ్డి, పందరబోయిన శ్రీనివాసరావు, అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**బాపట్ల అర్బన్:** సువర్చలా సమేత ప్రపత్యాంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి పంచామృత స్నపన, నగరోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో అర్చకులు విఖనసమూర్తి, అప్పలాచార్యులు, కేశవాచార్యులు, వంశీ, కృష్ణమాచార్యులు, శ్రీ మారుతీ రామ బాలభక్త సమాజం అధ్యక్షుడు నెమలికంటి హనుమంతరావు పాల్గొన్నారు.

**నేడు అభయాంజనేయస్వామి జయంత్యుత్సవం**

**భట్టిప్రోలు:** భట్టిప్రోలు వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రతిష్ఠించబడిన అభయాంజనేయ స్వామి జయంత్యుత్సవం ఆదివారం జరుగుతుందని దేవస్థాన కమిటీ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, స్వామి వార్లకు అభిషేకాలు, సహస్రనామ, ఆకుపూజ, అష్టోత్తర పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. రాత్రి దేవస్థాన కళావేదిక ఆవరణలో సువర్చలా సమేత అభయాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

# ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థి బాలాజీని అభినందించిన యూటీఎఫ్ నాయకులు

**కర్లపాలెం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలని యూటీఎఫ్ శాఖ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఎండీ మున్వర్ బాషా పేర్కొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన చింతాయపాలెం హైస్కూల్ విద్యార్థి బాలాజీని, ద్వితీయ స్థానంలో నిలిచిన యాజలి హైస్కూల్ విద్యార్థి కె.అక్షయను, తృతీయ స్థానంలో నిలిచిన పేరలి హైస్కూల్ విద్యార్థిని ఎం.థెరీసాను యూటీఎఫ్ నాయకులు వారి ఇళ్లకు వెళ్లి అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మున్వర్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.వెంకటేశ్వరరెడ్డి, వైవీ నారాయణ, ఇ.పోటీస్‌రావు, ఎండీ అక్రమ్‌ఫెరీ, పి.బాలాజీ, సీహెచ్. అజయ్‌కుమార్, సీహెచ్ ప్రభాకర్, జె.డేవిడ్, వి.రాఘవేంద్ర, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రూ.5లక్షల విరాళం



విరాళాన్ని విగ్రహ కమిటీ సభ్యులకు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి

**నగరం:** డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణానికి దాతలు విరాళాలు అందించడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. రేపల్లె పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు ఎన్ఆర్ఐ డాక్టర్ చందోలు నాగమల్లేశ్వరరావు అందించిన రూ.5లక్షల విరాళాన్ని ఆయన విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, మాజీ ఎంపీపీ చందోలు దేవదాసు, రిటైర్డ్ జడ్జి కూచిపూడి ప్రసాదరావు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఇంటింటా ధర్మ ప్రచారం

**గుత్తావారిపాలెం(భట్టిప్రోలు):** పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెంలో సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) సభ్యులు శనివారం ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ దేవాలయాల్లో ప్రతి వారం భజనలు, నెలకోసారి సామూహిక హారతులు, నగర సంకీర్తన, సత్సంగాలు నిర్వాహించాలని తెలిపారు. అప్పుడే దేవాలయాలు శక్తి కేంద్రాలుగా మారతాయని పేర్కొన్నారు. హిందూ ధర్మం గొప్పతనం గూరించి తెలియజేస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు అందించి, స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ జంపని గుడారమ్మ, శివ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రామాలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు



హోమ గుండ పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

**చెరుకుపల్లి:** గుళ్లపల్లి ఎస్టీ కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం (శ్రీవాణి ట్రస్ట్)వారి ఆర్థిక సహాయంతో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రెండవ రోజు శాస్త్రోక్తంగా గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, హోమగుండ పూజ, నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలకు గ్రామంలోని పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10.52 గంటలకు ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం, శ్రీ అగ్నిహోత్రం కార్యక్రమాలను షేచార్యులు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, ఆలయ నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



**బాపట్ల అర్బన్:** పేదలకు సేవలందించడం అభినందనీయమని బాపట్ల ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ కోటేశ్వరరావు పేర్కొన్నారు. చెరువు జమ్ములపాలెం గ్రామానికి చెందిన జేసీఎస్ ఎంఎం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్ వెస్లి ఆధ్వర్యంలో రోగులకు మాస్కులు, పండ్లు, రొట్టెలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఓఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ పేద రోగులను ఆదుకునేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థల ముందుకు రావాలన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సొసైటీ సభ్యుల సేవలను కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు చేయటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి ఏసుబాబు, దాసరి పౌలు, రాజు, కటికల పవన్ కల్యాణ్, దాసరి పవన్ కుమార్, సుభాని, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# గెలుపు కోసమే ఆడాలి



ఆటగాళ్లతో శ్యాంసుందరరావు


- ఓడిపోతే క్రీడాస్ఫూర్తి అనుకుని సరిపెట్టుకోరాదు
- అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మొవ్వా శ్యాంసుందరరావు

**తెనాలి:** క్రీడాకారులు గెలుపు కోసమే ఆడాలి...ఓడిపోయినా ఫర్వాలేదు...క్రీడాస్ఫూర్తి అనుకుని సరిపెట్టుకోరాదని ఒకప్పటి ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు, కోచ్ మొవ్వా శ్యాంసుందరరావు స్పష్టం చేశారు. గొప్ప క్రీడాకారులు ప్రాక్టీస్ గేమ్‌లో ఓటమిని సైతం జీర్ణించుకోలేరని తెలిపారు. తెనాలికి చెందిన శ్యాంసుందరరావు వాలీబాల్ క్రీడలో ఉన్నత శిఖరాల్ని అందుకున్నారు. క్రీడాకారులు, శిక్షకులకు బహూకరించే అర్జున, ద్రోణాచార్య అవార్డుల్ని భారత ప్రభుత్వం నుంచి స్వీకరించారు. మిలటరీ, రైల్వేల్లో పని చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా 2001లో రిటైరయ్యారు. 2007–11లో జాతీయ కోచ్‌గా పని చేశారు. స్వస్థలం తెనాలి సమీపంలోని జంపని. ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం తెనాలి వచ్చారు. సాయంత్రం స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియానికి వచ్చారు. ఇన్‌చార్జి, వాలీబాల్ కోచ్ కాకర్ల కోటేశ్వరరావు నేతృత్వంలో స్టేడియంలో వాలీబాల్ ఆటగాళ్ల సాధనను తిలకించారు. ఇదే స్టేడియంలో సాధన ఆరంభించి జూనియర్ నేషనల్స్, యూనివర్శిటీ స్థాయిలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్ని అభినందించారు. కాంబినేషన్‌తో కూడిన వాలీబాల్ ఆటలో ఏకాగ్రత, పట్టుదలతో సాధన చేసినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలరని సూచించారు. నిబద్ధతతో కూడిన సాధన చేసినపుడే మంచి క్రీడాకారులు కాగలగరని చెప్పారు. ఓటమిని తేలికగా తీసుకోరాదని, ఎక్కడ లోపం జరిగిందో సమీక్షించుకుని, పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. సాధన తర్వాత కూడా ఖాళీ సమయంలోనూ మెంటల్ రిహార్సల్స్ చేసుకోవడం అదనపు ప్రాక్టీస్ అవుతుందని చెప్పారు. ఓటమి చెందినపుడు జట్టులో తప్పొప్పుల్ని సానుకూల దృక్పథంతో చర్చించుకోవాలి మినహా కారకుల్ని వేలెత్తి చూపడం తగదన్నారు. గతంలో కోచ్‌లంటూ ప్రత్యేకంగా ఉండేవారు కాదని గుర్తుచేశారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆసక్తితోనే క్రీడలకు ప్రోత్సాహం లభించి, మంచి క్రీడాకారులు వచ్చారని సోదాహరణంగా చెప్పారు. తొలుత స్టేడియానికి వచ్చిన శ్యాంసుందరరావుకు కోచ్ కాకర్ల కోటేశ్వరరావు, వాలీబాల్ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు.

### 379 కేసుల పరిష్కారం

**తెనాలి రూరల్:** తెనాలి కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 379 కేసులు పరిష్కారమయ్యాయి. వివి ధ కేసులకు సంబంధించి జరిమానా/అపరాధ రుసుం కింద రూ.2.24 కోట్లు కట్టించారు. 36 సివిల్, 331 క్రిమినల్, 12 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరమయ్యాయి. సమావేశానికి 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి అధ్యక్షత వహించారు.

### లోక్ అదాలత్‌లో 335 కేసుల పరిష్కారం



**బాపట్ల:** బాపట్లలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 335 కేసులు శనివారం పరిష్కారమయ్యాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాధుబాబు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 335 కేసులకు గాను రూ.73.05లక్షల లావాదేవీలు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.సీతారామకృష్ణారావు, జి.వాణి, ఎం.సత్యకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లీలాకృష్ణ, న్యాయవాదులు బండి రామమూర్తి, బి.కమల్ కుమార్, వై.ఉషారాణి తదితరులు ఉన్నారు.

# పవిత్ర హజ్ యాత్రకు ప్రభుత్వం పూర్తి సహకారం

**పట్నంబజారు:** సమాజానికి మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అల్లాను కోరుతూ ప్రత్యేకంగా ప్రార్థించాలని హజ్ యాత్రికుల్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కోరారు. గుంటూరు టూ టౌన్ ఉలేమా సొసైటీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా కమిటీ ఆధ్వర్యంలో శనివారం హజ్–2023 యాత్రికుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ అల్లా ఆశీర్వాద బలంతో పరమ పవిత్రమైన హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని ఆకాంక్షించారు. పవిత్ర హజ్ – 2023 యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు అసౌకర్యాలు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టిందని చెప్పారు. హజ్ యాత్ర ప్రయాణ చార్జీలో తేడా ఉన్న రూ. 80వేలను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ పరమ పవిత్రమైన హజ్ యాత్రకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహాయ, సహకారాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసుల్ ఆజమ్ మాట్లాడుతూ గతంలో హజ్ యాత్రికుల సౌకర్యార్థం 150 మందికి ఒక వలంటీర్ వెళ్లేవారని, ఈసారి 300 మందికి ఒక వలంటీరును మాత్రమే కేంద్ర ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి ఈసారి హజ్ కమిటీ చైర్మన్‌తో పాటు తొమ్మిది మంది బృందాన్ని స్వ యంగా రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో హజ్ యాత్రకు పంపేందుకు అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ముఫ్తీ బాసీత్, మస్తాన్ వలీ, ప్రభుత్వ ఖాజీ హఫీజ్ ఉస్మాన్ సిద్దిఖి పాల్గొన్నారు.

# జొన్న పంట కొనుగోలు వేగవంతం చేయండి

**తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివన్నారాయణశర్మ**



వడ్లమూడిలో తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న శివన్నారాయణశర్మ తదితరులు

**చేబ్రోలు:** కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెనాలి ఇంచార్జి సబ్ కలెక్టర్ శివన్నారాయణశర్మ సిబ్బందిని ఆదేశించారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో శనివారం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 శాతం కన్నా ఎక్కువ దెబ్బతిన్న పంటల జాబితా, వర్షాలకు పంట దెబ్బతిన్న రైతుల జాబితాను వెంటనే అందజేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఏవో బి. శ్రీనివాసనాయక్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సంరక్షణ కేంద్రంలో గోవులకు సకల సదుపాయాలు



వెంగళాయపాలెం గో సంరక్షణ కేంద్రంలో పర్యటిస్తున్న మేయర్ కావటి

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలోని సంరక్షణ కేంద్రంలో గోవులకు సకల సదుపాయాల్ని కల్పించినట్లు మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. గో సంరక్షణ సేవా దళ్ సమితి సభ్యులతో కలసి శనివారం కేంద్రాన్ని పరిశీలించారు. ఆవుల సంఖ్య, సంరక్షణ, సిబ్బంది గురించి అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆవులకు సకాలంలో ఆహారం, నీరు అందించాలని సిబ్బందికి చెప్పారు. కేంద్రంలో తాగునీటి సౌకర్యం, మేత వేయడానికి తొట్టెలు, వర్షాలకు తడవకుండా మరో పాకతో పాటు లైట్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, గో సంరక్షణ సేవా దళ్ సమితి సభ్యులు భజరంగ్ రామకృష్ణ, పెద్దింటి కృష్ణ చైతన్య, ప్రదీప్ కుమార్ జైన్, సురేష్ కుమార్ జైన్, నిఖిల్ జైన్, రాజు పూర్వాల్, దినేష్ సాంఘి, వీరయ్య చౌదరి, నరసింహమూర్తి, అంకాల శ్రీనివాస్, వంగ నవీన్‌రెడ్డి డీఈఈ రమేష్, ఏఈ నాగవేణి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**తెనాలిటౌన్:** నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. 14న వీరాంజనేయ స్వామికి పంచామృతాలతో అభిషేకం. 18న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిరందాసు విజయకుమారి, ఎం.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### 16న యూటీఎఫ్ ఉద్యమ తరగతులు



**తెనాలి:** విద్యారంగ పరిణామాలపై ఈ నెల 16న తెనాలిలోని పెన్షనర్స్ హోంలో జరగనున్న ఉద్యమ తరగతులను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ పేర్కొన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన తెనాలి ప్రాంతీయ శాఖల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఉద్యమ తరగతుల్లో సందేశం ఇస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు ప్రభుత్వ విధానాలపై మాట్లాడారు. జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి దేల, జిల్లా కార్యదర్శులు కె.సాంబశివరావు, ఆదినారాయణ, కె.రంగారావు, షేక్ అహ్మద్ హుస్సేన్, రామకృష్ణ పాల్గొన్నారు.